**ప్రజల మాట ప్రగతి బాట**

## బెల్లంపల్లి నియోజకవర్గం

# ఎన్నికలకు పకడ్బందీ చర్యలు

- బెల్లంపల్లి బజార్ ఏరియా పాఠశాలలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు
- నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ముమ్మరంగా తనిఖీలు



స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేసిన బజార్ ఏరియా పాఠశాల ఇదే

బెల్లంపల్లి, అక్టోబర్ 21: అసెంబ్లీ ఎన్నికలు విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ శాతం పెంచడమే కాకుండా ఈవీఎంల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ఎన్నికల స్ట్రాంగ్ రూం, డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగా తహసీల్ కార్యాలయాన్ని వినియోగించారు. ఆ కార్యాలయ గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, బెల్లంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థలను పరిశీలించారు. పట్టణ నడిబొడ్డున పాతబస్టాండ్ ఏరియాలో ఉన్న జిల్లా పరిషత్ బజార్ ఏరియా పాఠశాలకు ఇందుకు ఎంపిక చేశారు. పాఠశాలలో నాలుగు విభాగాలుగా గదుల సముదాయం ఉండడం, వెనుక భాగాన తిలక్‌స్టేడియం ఉండడంతో ఈ పాఠశాలను ఎంపిక చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్ తెలిపారు. తహసీల్ కార్యాలయం ఎదుట ఉన్న ఏఎంసీ మైదానం కంటే తిలక్‌స్టేడియం చాలా పెద్దగా విశాలంగా ఉంటుందని ఎంపిక చేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే బజార్ ఏరియా పాఠశాలకు వెనుక భాగంలో రెండు తాత్కాలిక ద్వారాలను ఏర్పాటు చేసి వాటికి అనుగుణంగా మెట్లను నిర్మించారు. తిలక్‌స్టేడియంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు వీలుగా తీర్చిదిద్దుతున్నారు. స్ట్రాంగ్ రూంలను కూడా పెయింటింగ్‌తో చక్కగా అలంకరిస్తున్నారు.

**అదనంగా ఐదు పోలింగ్ కేంద్రాలు..**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలు, ఒక మున్సిపాలిటీలో 2018 ఎన్నికల్లో 222 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో నిబంధనలకు అనుగుణంగా మరో ఐదు పోలింగ్ కేంద్రాలను పెంచారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. దీనికిగాను వారి వద్ద నుంచి 12 డీ ఫారాన్ని నింపి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అధికార యంత్రాంగం అందుకు తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఒకసారి 12 డీ ఫామ్ తీసుకున్న తర్వాత పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేస్తానంటే అధి సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో అంధుల 521, మూగ, చెవిటి 437, నడవలేనివారు 1534, ఇతరులు 183గా గుర్తించారు.

**31 వరకు ఓటర్ నమోదుకు గడువు**

ఓటర్‌గా నమోదుకు ఈ నెల 31 వరకు తుది గడువు విధించింది. ఇందుకు ఎన్నికల అధికారులు ఓటు హక్కుపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బెల్లంపల్లిలో 1,69,598 ఓటర్లను గుర్తించారు. 84,790 పురుషులు, 84,796 మహిళలు, 12 ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బెల్లంపల్లి పట్టణం, మండలంలో 62575, కాసిపేట మండలంలో 26125, తాండూర్‌లో 26169, కన్నెపల్లిలో 13484, భీమినిలో 8314, వేమనపల్లిలో 14505, నెన్నెలలో 18426లను గుర్తించారు.

**50 వేల కంటే తక్కువ నగదుతో ప్రయాణించాలి**

ఎన్నికల కోడ్ ప్రకారం ప్రజలు రూ.50 వేల కంటే తక్కువ నగదుతో ప్రయాణించాలని బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి రాహుల్ తెలిపారు. చిరువ్యాపారులు, ఇతరులకు నగదు సంబంధిత రసీదులు, ఆధారాల కోసం ఇబ్బందులు పడుతున్నా దృష్ట్యా 49,500 ఆ తరహా నగదుతో ప్రయాణించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే బెల్లంపల్లి నియోజకవర్గంలో రూ.20 లక్షలకు పైగా నగదును పట్టుకున్నారు. కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి, కన్నాల ఫ్లై ఓవర్ బ్రిడ్జి, తాండూర్ చెక్‌పోస్టుతో పాటు పట్టణంలోని పలు ఏరియాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

## ఆయిల్ పామ్ మొక్కలకు 90 శాతం సబ్సిడీ

**- హార్టికల్చరల్ బెల్లంపల్లి క్లస్టర్ ఆఫీసర్ సుప్రజ**



ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలిస్తున్న హార్టికల్చరల్ ఆఫీసర్ సుప్రజ

కాసిపేట, అక్టోబర్ 21 : ఆయిల్ పామ్ మొక్కలను 90 శాతంపై అందించనున్నట్లు హార్టికల్చరల్ ఆఫీసర్ సీహెచ్ సుప్రజ వివరించారు. శనివారం కాసిపేట మండలంలోని ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా హార్టికల్చరల్ క్లస్టర్ ఆఫీసర్ సుప్రజ మాట్లాడుతూ ఉద్యాన శాఖ ఆయిల్ పామ్ మొక్కలను 90 శాతం సబ్సిడీపై అందిస్తున్నదని, మొక్కల సంరక్షణకు ఎకరానికీ రూ.2100, ఇంటర్ క్రాప్ వేసుకోడానికి ఎకరానికి రూ.2100, మొత్తం రూ.4200 అందిస్తున్నదని తెలిపారు. నాలుగు సంవత్సరాల వరకు పంట ఉండదు కాబట్టి నాలుగేళ్ల పాటు అందించనున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ తోటలకు డ్రిప్ పరికరాలకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ, బీసీలకు 90 శాతం, ఓసీలకు 80 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ ఏర్పాటు సందేహాల కోసం 7997725034, 8919896772లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


## బెల్లంపల్లివాసికి సావిత్రీబాయి పూలే అవార్డు



అవార్డు అందుకుంటున్న రాధిక

బెల్లంపల్లి, అక్టోబర్ 21: పట్టణంలోని రైల్వే పెద్దనపల్లికి చెందిన వోరుగంటి రాధికకు సావిత్రీబాయి పూలే అవార్డు దక్కింది. సిద్దిపేట జిల్లాలో పీజీటీ సోషల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రాధిక జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రదాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో చేస్తున్న సేవలకు ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. పట్టణ ప్రజలు, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఆదివాసీ సేనకమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు

కాసిపేట, అక్టోబర్ 21 : కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో జిల్లా ఆదివాసీ సేన అధ్యక్షుడు కోట్నాక తిరుపతి ఆధ్వర్యంలో కాసిపేట మండలంలోని ఆయా ఆదివాసీ గిరిజన గ్రామాల పటేళ్లు, రాయి సెంటర్ సర్మేడీలు, తుడుందెబ్బ, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ సేన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మడావి గంగారాం, మండల అధ్యక్షుడిగా మడావి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెందూర్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా సిడం గణపతి, ఉపాధ్యక్షుడిగా పెందూర్ ప్రభాకర్, సిడం శంకర్, కోశాధికారిగా ఆత్రం సంజీవ్, సలహాదారులుగా కుమ్ర జనార్దన్, వెద్మ బాపురావు, అర్క జైతు, కుర్సింగ ఇస్రు, మడావి ప్రభాత్‌రావు, పెంద్రం సింగు, ఉయిక మోతీరాంను ఎన్నుకున్నారు.

## గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, అక్టోబర్ 21:తాపీ సంఘం పట్టణ అధ్యక్షుడు రామ్ నూతన గృహ ప్రవేశానికి శనివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గెల్లిరాజలింగు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కే మద్దతుగా నిలవాలి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బీఆర్ఎస్‌లో చేరికలు



బెల్లంపల్లి రూరల్ : ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గ్రామస్తులు

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 21: సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ సర్కారుకే ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి మండలంలోని చాకెపల్లిలో శనివారం ఎమ్మెల్యే సమక్షంలో 45 మంది గ్రామస్తులు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తామంతా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోనూ అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టాలని సూచించారు.

**దుర్గామాతకు పూజలు**

బెల్లంపల్లి, అక్టోబర్ 21: దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు బెల్లంపల్లిలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పలు దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రైల్వే స్టేషన్ పెద్దనపల్లి దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే జాతీయ బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్న వోరం రాధికను శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కౌన్సిలర్లు కొక్కెర చంద్రశేఖర్, గోసిక రమేశ్, నాయకులు బడికల రమేశ్, గాల శ్రీనివాస్ తదితరులున్నారు.



అవార్డు గ్రహీత రాధికను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## మేకలకు భలే గిరాకీ

తాండూర్, అక్టోబర్ 21 : దసరా పండుగను పురస్కరించుకుని తాండూర్ మండల కేంద్రంలోని వార సంతలో సందడి నెలకొన్నది. మేకల సంతలో మేకల కొనుగోళ్లు పెద్ద ఎత్తున కొనసాగాయి. దసరా పండుగను పురస్కరించుకుని శనివారం, ఆదివారం రెండు రోజులు సంతను నిర్వహించనున్నారు. మేకల సంతలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో మేకల సంత చాలా పెద్ద ఎత్తున కొనసాగుతుంది. కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ నుంచి ప్రజలు పెద్ద ఎత్తున సంతకు తరలివచ్చి మేకలు కొనుగోలు చేశారు. గత అంగడి కంటే మేకల ధరలు అత్యధికంగా ఉన్నట్లు కొనుగోలుదారులు పేర్కొంటున్నారు.



తాండూర్ మేకల సంతలో రద్దీ

## మార్కెట్లో పండుగ సందడి..



మార్కెట్ ఏరియాలో పూలు విక్రయిస్తున్న వ్యాపారులు

బెల్లంపల్లి, అక్టోబర్ 21: దసరా, బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సద్దుల బతుకమ్మ పండుగను ఆదివారం ప్రజలు నిర్వహించుకోనున్నారు. దీంతోశనివారమే బెల్లంపల్లిలో బజార్ ఏరియా పండుగ వాతావరణం నెలకొన్నది. చుట్టు పక్క మండలాల నుంచి గ్రామీణులు తంగేడు పువ్వు, బంతి, వివిధ రకాల పూలు తీసుకువచ్చి విక్రయాలు కొనసాగించారు. దీంతో బజార్ ఏరియా నుంచి మార్కెట్ ఏరియా వరకు కోలాహలంగా మారింది. మహిళలు పోటీ పడి మరీ పువ్వులను కొనుగోలు చేశారు. ఈ రద్దీ ఆదివారం వరకు కూడా కొనసాగనుంది.